పంటల బీమా.. లేదు ధీమా..!

- కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో అన్నదాతకు దూరమైన పంటల బీమా పథకం
- చీమకుర్తి మండలంలో 1,500 ఎకరాల్లో పంటల సాగు
- కేవలం 10 శాతం రైతులు మాత్రమే బీమా నగదు చెల్లింపు
- అవగాహన కల్పించడంలో అధికారులు, పాలకులు విఫలం
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నూరు శాతం బీమా నమోదు


బండ్లమూడి గ్రామంలో మిరప పంటకు పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతు

చీమకుర్తి రూరల్: రైతుల పట్ల కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం మరోసారి తేటతెల్లమైంది. అధికారంలోకి వచ్చిన మొదటిరోజు నుంచే వ్యవసాయాన్ని, అన్నదాతలను కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. పెట్టుబడి సాయం అందించకపోవడంతో పాటు రైతులకు అవసరమైనవేవీ సమకూర్చకుండా వారి సంక్షేమాన్ని గాలికొదిలేసింది. తాజాగా పంటల బీమా పథకాన్ని రైతులకు దూరం చేసింది. పథకంపై అన్నదాతలకు అవగాహన కల్పించి బీమా నగదు చెల్లించుకునేలా చేయడంలో అధికారులు, పాలకులు అలసత్వం ప్రదర్శించారు. దీంతో చీమకుర్తి మండలంలో కేవలం 10 శాతం రైతులు మాత్రమే పంటల బీమా పథకానికి ప్రీమియం చెల్లించారు. 90 శాతం మంది రైతులు చెల్లించకపోవడంతో పంట నష్టం జరిగితే పరిహారం అందే అవకాశం లేకుండా పోయింది.

చీమకుర్తి మండలంలో వరి, మినుము, రాగులు, వేరుశనగ, మొక్కజొన్న, పెసలు వంటి అన్ని పంటలు కలిపి 1,500 ఎకరాల్లో రబీ సీజన్‌లో సాగు చేశారు. కానీ, పంటల బీమా పథకానికి ప్రీమియం చెల్లించిన రైతుల సంఖ్య 118 మాత్రమే ఉంది. ప్రీమియం చెల్లించిన పొలం కేవలం 159 ఎకరాలే ఉండటంతో 10 శాతం రైతులు మాత్రమే బీమా నగదు చెల్లించినట్లు తెలుస్తోంది. కూటమి పాలనలో రైతులకు ఒక్క మేలు కూడా జరగడం లేదు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా ఇప్పటికీ రైతు భరోసా అందలేదు. ఉచిత పంటల బీమా లేదు. ప్రస్తుతం రబీ సీజన్ సైతం అనుకూలంగా లేదనే భావన అన్నదాతల్లో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో అండగా నిలవాల్సిన ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉచితంగా పంటల బీమా...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్నదాతలకు ఉచితంగా పంటల బీమా పథకాన్ని అమలు చేశారు. బీమా ప్రీమియం నగదును ప్రభుత్వమే చెల్లించింది. ఈ-పంటలో నమోదు చేసుకున్న ప్రతి రైతుకు బీమా నగదు చెల్లించింది. దీంతో నూరుశాతం పంటల బీమా నమోదైంది. కూటమి ప్రభుత్వం రాగానే రైతులే బీమా ప్రీమియం చెల్లించుకోవాలని చెప్పి వదిలేసింది. దానిపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కూడా కల్పించకుండా చేతులెత్తేసింది. దానివల్ల గత ఖరీఫ్ సీజన్‌లో భారీగా రైతులు నష్టపోయారు. ప్రస్తుత రబీ సీజన్లోనూ బీమా ప్రీమియం చెల్లిస్తేనే పంటల బీమా వర్తిస్తుందనే దానిపై రైతులకు స్పష్టత ఇచ్చి ప్రీమియం నగదు చెల్లించుకునేలా అవగాహన కల్పించకుండా నిర్లక్ష్యంగా వదిలేసింది. దీంతో బీమా ప్రీమియం చెల్లింపులు అంతంతమాత్రంగానే జరిగాయి. రైతులకు నష్టం కలిగేలా కూటమి ప్రభుత్వ పనితీరు ఉందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం జరిగితే పరిహారం కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది. రైతుల సంక్షేమాన్ని కాలరాసి వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్న కూటమి సర్కారుపై అన్నదాతల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

“ గత ప్రభుత్వంలో మిర్చి పైరుకు రూ.4.90 లక్షల పరిహారం అందింది



నేను 2022లో 7 ఎకరాల్లో మిరప పంట వేశా. అప్పుడు రైతు భరోసా కేంద్రంలో ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవడంతో పంటకు ప్రభుత్వమే రైతుల పక్షాన బీమా ప్రీమియం మొత్తం చెల్లించింది. వర్షాల కారణంగా మిరప పంట దెబ్బతింది. నష్టపరిహారంగా నాకు రూ.4.90 లక్షలు అందింది.

– నల్లూరి చంద్ర, గుండువారి లక్ష్మీపురం

“ గత ప్రభుత్వంలో కంది పంటకు రూ.15 వేలు పరిహారం అందింది



గతంలో నేను కంది పంటను ఒక ఎకరాలో సాగు చేశా. ఆనాటి ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రంలో ఈ-పంట నమోదు చేసుకోవడంతో మాకు ప్రభుత్వమే ఉచితంగా బీమా చేయించింది. ప్రకృతి వైపరీత్యాల వలన పంట నష్టం జరగడంతో ఆనాటి ప్రభుత్వం నాకు నష్టపరిహారం కింద రూ.15 వేలను 2021, 2022 సంవత్సరాలలో అందజేసింది.

– ఎర్రగుంట్ల మోహన్, కేవీ పాలెం

“ పాత పద్ధతి అమలు చేయాలి



గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన మాదిరిగానే ఇప్పుడు కూడా కూటమి ప్రభుత్వం ఉచితంగా పంటల బీమా పథకం అమలు చేయాలి. గత ప్రభుత్వంలో సాధారణ రైతులతో పాటు కౌలు రైతులకు కూడా పూర్తిస్థాయిలో పరిహారం అందించేవారు. ఇప్పుడు ఆ సదుపాయం లేకపోవడంతో సాధారణ రైతాంగంతో పాటు కౌలు రైతులు తీవ్రంగా నష్టపోనున్నారు.

– పమిడి వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, చీమకుర్తి

రైతులకు భారంగా పంటల బీమా నగదు



రైతులను ఆదుకుంటామని, రైతు భరోసా సాయం కింద రూ.20,000 ఇస్తామని ఎన్నికల ప్రచారంలో కూటమి ప్రభుత్వం ప్రగల్భాలు పలికింది. అధికారంలోకి వచ్చాక రైతులను పట్టించుకోకపోగా, నిలువునా మోసం చేసింది. పంటల బీమా ప్రీమియం నగదు రైతులే చెల్లించాలంటూ భారం వేయడం సరికాదు.

– బొద్దు కోటేశ్వరరావు, సంతనూతలపాడు నియోజకవర్గ బూత్ కమిటీల అధ్యక్షుడు

విద్యార్థులకు ఆటల పోటీలు


ఆటల పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు, అధికారులు

మద్దిపాడు: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా స్థానిక కడియాల యానాదయ్య ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్రం, సస్ హెల్పింగ్ పీపుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం ప్రకాశం జిల్లా యూత్ ఆఫీసర్ కమల్ పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చలగాల విజయ్ కుమార్ మాట్లాడుతూ క్రీడల ద్వారా యువత శారీరక ఆరోగ్యం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోటిరెడ్డి, ప్రిన్సిపాల్ దాసరి రమేష్, ఎంఈఓ ఆంజనేయులు, బోయలపల్లి ప్రభావతి, హరి, కిషోర్ కుమార్, రూడ్‌సెట్ సిబ్బంది, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచినీటి పథకాలను తనిఖీ చేసిన జెడ్పీ సీఈఓ


చీమకుర్తిలో మంచినీటి పథకాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి

చీమకుర్తి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఉచితంగా మంచినీరు సరఫరా చేసే సమగ్ర రక్షిత మంచినీటి పథకాలను జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి శుక్రవారం తనిఖీ చేశారు. పల్లామల్లి మంచినీటి పథకం, చీమకుర్తి మంచినీటి పథకాల ఫిల్టర్ బెడ్లు, పంప్ హౌస్‌లను పరిశీలించారు. పథకాల పనితీరు గురించి గ్రామీణ నీటిపారుదల అధికారిణి శాంతిప్రియను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా మంచినీరు సరఫరా చేయాలన్నారు. మంచినీరు సరఫరా చేసే కాంట్రాక్టర్లకు ఏ గ్రామంలోనైనా సమస్య వస్తే వెంటనే ఆ పైపులైన్‌కు మరమ్మతులు చేసి సక్రమంగా మంచినీరు సరఫరా చేయాలన్నారు. చీమకుర్తి మండల అభివృద్ధి అధికారి కె.రాఘవేంద్ర, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

రేపు రైతుల ర్యాలీని జయప్రదం చేయండి


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నాగులుప్పలపాడు: కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ ఒంగోలులో తలపెట్టిన మోటార్ సైకిళ్లు, ట్రాక్టర్ల ర్యాలీని జయప్రదం చేయాలని రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు జె.జయంతిబాబు కోరారు. శుక్రవారం నాగులుప్పలపాడులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం దేశానికి అన్నం పెట్టే అన్నదాతల పట్ల నిరంకుశంగా ప్రవర్తిస్తోందని విమర్శించారు. ఏడాది పాటు రైతు ఉద్యమం సాగినా ప్రభుత్వం దిగిరాలేదన్నారు. రైతులకు క్షమాపణ చెప్పి వ్యవసాయ వ్యతిరేకంగా తెచ్చిన నల్ల చట్టాలను రద్దు చేయకుండా తిరిగి ఆ చట్టాలనే అమలు చేసేందుకు కుట్ర పన్నుతోందన్నారు. రైతులు, కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను అమలు చేయాలని కోరుతూ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుల పట్ల ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని ఎద్దేవా చేశారు. అందుకు నిరసనగా ఈ నెల 26వ తేదీ తలపెట్టిన ర్యాలీలో మండలంలోని రైతులంతా తమ ట్రాక్టర్లతో, కార్మికులంతా తమ వాహనాలతో వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా నాయకుడు శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికుల కోసం ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌ల వితరణ


ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు అందిస్తున్న హాస్పిటల్ యాజమాన్యం

ఒంగోలు సిటీ: ఆర్టీసీ ప్రయాణికులకు ప్రథమ చికిత్స సౌకర్యార్థం ఒంగోలు శ్రీరామ్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ వారు ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లను స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో శుక్రవారం డిపో మేనేజరు డి.శ్రీనివాసులుకు బహూకరించారు. హాస్పిటల్ ఎండీ డాక్టర్ చాపల వంశీకృష్ణ, ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మెకానిక్ విజయ, బాలిశెట్టి ఫణికుమార్, ప్రభాకరరావు, చిన్నయ్య, బైరెడ్డి ప్రవీణ్‌కుమార్, షేక్ ఖాసీం సైదా, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాల దుకాణాలపై దాడులు


రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలపై కనిగిరి ఏడీఏ ఈ.వెంకటరమణ ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. శ్రీకృష్ణ ట్రేడర్స్ దుకాణంలో సరైన పత్రాలు లేని కారణంగా రూ.2.23 లక్షల విలువైన స్టాకు విక్రయాలను నిలిపేశారు. తనిఖీలో ఏఓ విజయభాస్కర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- ఏపీ టీచర్స్ గిల్డ్ వినతి

ఒంగోలు సిటీ: ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలను విద్యాశాఖ కమిషనర్ త్వరితగతిన పరిష్కరించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరావు, సీహెచ్.ప్రభాకరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఒంగోలు వివేకానంద ఓరియంటల్ ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే ఇద్దరు ఉపాధ్యాయులకు పదేళ్ల నుంచి వారి సర్వీసు రిజిస్టర్లు యాజమాన్యం ఇవ్వకుండా పీఆర్సీలు కాకుండా పాత జీతాలతోనే పనిచేస్తున్నారని తెలిపారు. అలాగే కంభం శ్రీ సత్యన్నారాయణ శ్రీనివాస ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే సూర్యనారాయణ అనే ఉపాధ్యాయుడికి గత ఎనిమిది సంవత్సరాల నుంచి పాత జీతంతోనే పీఆర్సీ చేయక పనిచేస్తున్నారన్నారు. పర్చూరు మండలం, చెరుకూరు గ్రామంలోని ఆంధ్రకేసరి మెమోరియల్ రెసిడెన్సీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో పనిచేసే ఇద్దరు ఉపాధ్యాయులు వాలంటరీ రిటైర్మెంట్ ఇవ్వలేదని గత 12 నెలల నుంచి యాజమాన్యాలు జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. కొమరోలు మండలం, గోపాలనపల్లి ఏబీఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో పనిచేసే డి.ఆంజనేయులుకి జీతాల బిల్లును ఎస్టీఓ చేత యాజమాన్యం రిజెక్టు చేయిస్తుందన్నారు. పైన తెలిపిన సమస్యలతో పాటు జిల్లాలో విద్యార్థులు లేని ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు శాశ్వత కౌన్సిలింగ్ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లోకి సర్దుబాటు చేయాలని కోరారు. ఈ సమస్యలన్నింటినీ ఆర్‌జేడీ ద్వారా జిల్లా విద్యాశాఖ అధికారుల ద్వారా సత్వరమే పరిష్కరించి ఉపాధ్యాయులకు సత్వరమే న్యాయం చేయాలన్నారు.

రెండు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు


పశువులకు వైద్యం చేస్తున్న డాక్టర్లు


సంతనూతలపాడు: మండలంలోని గుమ్మలంపాడు, రుద్రవరం గ్రామాల్లో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. 3,918 గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలు, పశువులకు చికిత్స చేశారు. పశువైద్యాధికారులు డాక్టర్ బి.ప్రతాపరెడ్డి, డాక్టర్ పి.చిరంజీవి, పశువైద్య సిబ్బంది పాల్గొని పశువులకు నట్టల నివారణ మందు తాపించి చికిత్స చేశారు. పశుపోషకులకు ఉచితంగా మందులు అందజేశారు. రుద్రవరం గ్రామంలో సర్పంచ్ బలరామిరెడ్డి, గుమ్మలంపాడులో మాజీ సర్పంచ్ నెప్పలి కనకయ్య, నాయకులు, పశుపోషకులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ వెంచర్ పరిశీలన


వెంచర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

మద్దిపాడు: మండల పరిధిలో రియల్ ఎస్టేట్ వెంచర్‌ను ఆర్డీవో లక్ష్మీప్రసన్న శుక్రవారం తనిఖీ చేశారు. మండల పరిధిలోని సీతారాంపురం పంచాయతీలో గల ఐకాన్ రియల్ ఎస్టేట్ వెంచర్ వారు ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకోగా, సదరు భూమిని లక్ష్మీప్రసన్న సందర్శించారు. తహసీల్దార్ సుజన్ కుమార్, మండల సర్వేయర్ అంజనీదేవి, ఆర్ఐ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ కార్యక్రమాలకు విశేష స్పందన


వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

చీమకుర్తి: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చీమకుర్తిలో శుక్రవారం నిర్వహించిన పలు కార్యక్రమాలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. రిపబ్లిక్ డే సందర్భంగా ఈ నెల 24, 25 తేదీల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం సామాజిక మాధ్యమాలు–విద్యార్థులపై ప్రభావం అనే అంశంపై వక్తృత్వ పోటీలు, దేశ ప్రగతిలో మహిళల పాత్ర–ఎదురవుతున్న సవాళ్లు, వాటి పరిష్కారాలు అనే అంశంపై వ్యాసరచన, గ్రామీణ ప్రాంత ప్రజల జీవన విధానంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. చీమకుర్తి మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 432 మంది విద్యార్థులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. తొలుత స్థానిక డాక్టర్ చెరుకూరి వెంకటేశ్వర్లు పోటీలను ప్రారంభించారు. విజేతలుగా నిలిచిన వారికి శనివారం క్విజ్ పోటీలు నిర్వహించిన అనంతరం బహుమతులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ వ్యవస్థాపకుడు చెరుకూరి రఘుకిరణ్, అధ్యక్ష, కార్యదర్శులు కడవా రామకృష్ణ, కందుకూరి సుధాకర్, మాజీ అధ్యక్ష, కార్యదర్శులు అంబటి వీరారెడ్డి, గోరంట్ల వెంకట్రావు, పోకూరి రామకృష్ణారెడ్డి, యడ్లపల్లి రామబ్రహ్మం, పరాంకుశం శ్రీనివాసమూర్తి, స్థానికులు పాల్గొన్నారు.

మద్దిపాడు పీహెచ్‌సీ తనిఖీ


మద్దిపాడు పీహెచ్‌సీలో సర్వే రికార్డులు పరిశీలిస్తున్న వైద్యాధికారులు

మద్దిపాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ టి.వాణిశ్రీ, డాక్టర్ బి.శ్రీవాణి శుక్రవారం తనిఖీ చేశారు. మండలంలో వెల్లంపల్లి గ్రామంలో జరుగుతున్న నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ అయిన కుష్టు వ్యాధి, రాష్ట్రీయ బాల్ స్వస్థ కార్యక్రమం, పునరుత్పత్తి, పిల్లల ఆరోగ్య కార్యక్రమం గురించి పీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న సర్వే రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సర్వే ఆధారంగా రానున్న కాలంలో ప్రజలకు అవసరమైన వైద్యం, మందులు అందించడం జరుగుతుందని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ టి.వాణిశ్రీ తెలిపారు. డాక్టర్ బి.శ్రీవాణి మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు తలపెట్టిన కుష్టు వ్యాధి సర్వేకి సంబంధించి ప్రతి ఇంటిలో ప్రతిఒక్కరినీ తప్పకుండా స్క్రీనింగ్ చేసి వారికి ఎలాంటి జబ్బులున్నాయన్న విషయాన్ని ఆన్‌లైన్లో అప్‌డేట్ చేయాలన్నారు. నూరుశాతం సర్వే నిర్వహించి తప్పులు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్రవణ్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ఆనంద్ మోహన్, డాక్టర్ శిరీష చంద్ర, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రజిత కుమారి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫిబ్రవరి 2న గ్రంథావిష్కరణ

ఒంగోలు మెట్రో: ఒంగోలు కళామిత్ర మండలి (తెలుగు లోగిలి) వీవీఐటీ సంస్థల సంయుక్త నిర్వహణలో ప్రముఖ పద్యకవి, గిడుగు పురస్కార గ్రహీత డీవీఎం సత్యనారాయణ రచించిన శ్రీకృష్ణ లీలారింఛోళి గ్రంథావిష్కరణ సభను స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఫిబ్రవరి 2వ తేదీ ఉదయం పది గంటలకు నిర్వహించనున్నట్లు కళామిత్ర మండలి (తెలుగు లోగిలి) జాతీయ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు డా.నూనె అంకమ్మరావు, సింహాద్రి జ్యోతిర్మయి ఒక ప్రకటనలో వెల్లడించారు. కవులు, రచయితలు పాల్గొనాలని కోరారు.

నయన మనోహరంగా ‘శంకర విజయం’

ఒంగోలు మెట్రో: స్థానిక పీవీఆర్ మున్సిపల్ గ్రౌండ్స్ ఆవరణలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ కళాపరిషత్ నాటకోత్సవాలలో శుక్రవారం రాత్రి శ్రీ నళినీ ప్రియా కూచిపూడి నృత్యానికేతన్ ఆధ్వర్యంలో ఎస్వీ శివకుమారి నృత్య దర్శకత్వంలో ప్రదర్శించిన శ్రీ శంకర విజయం ప్రేక్షకులను విశేషంగా అలరించింది. ఈ నృత్య రూపకాన్ని నెమ్మాని సీతారామమూర్తి రచించగా, శాంతి, జే బాలార్క సంగీతం అందించారు. ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు సారథ్యంలో కళాకారులను ఘనంగా సన్మానించారు. కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి అన్నమనేని ప్రసాద్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. నృత్య రూపకంలో జగద్గురు శంకరాచార్య స్వామి జీవితాన్ని సంపూర్ణంగా కళాకారులు ప్రదర్శించారు.

నేడు చిత్రలేఖన పోటీలు...

ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నేడు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చిత్రలేఖన, పెయింటింగ్ పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు బహుమతులు అందించనున్నారు. ఈ పోటీలకు సంబంధించిన పూర్తి వివరాలకు 94900 26977, 82973 12111 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

పన్ను బకాయిలు వెంటనే చెల్లించాలి

ఒంగోలు సబర్బన్: నగర పాలక సంస్థకు చెల్లించాల్సిన పన్ను బకాయిలు వెంటనే చెల్లించాలని కమిషనర్ వెంకటేశ్వరరావు కోరారు. ఆ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగియనుండటంతో నగర పాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తిపన్ను, ఖాళీ స్థలం పన్ను, మంచినీటి కుళాయి పన్ను బకాయిలన్నీ వెంటనే చెల్లించాలని కోరారు. చెల్లించని వారికి ఈఎస్‌డీ నోటీసులు జారీచేసి మంచినీటి కుళాయి కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరించారు. అనంతరం చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామన్నారు. సెలవు రోజుల్లో కూడా నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించి మరీ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

కష్టపడితే భవిష్యత్ బాగుంటుంది

ఒంగోలు సిటీ: బాలికలు కష్టపడే తత్వం అలవరచుకోవడం ద్వారా భవిష్యత్ బాగుంటుందని లాయర్ లక్ష్మీకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపాల్ కళ్యాణి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా న్యాయవాది లక్ష్మీకుమారి పాల్గొని మాట్లాడారు. బాలికా సాధికారత, వారి భవిష్యత్తు అనే విషయాన్ని పిల్లలకు వివరించారు. భారతదేశంలో బాల్యవివాహాలు, ఆడపిల్లల భ్రూణహత్యలు, లింగ అసమానత వంటి క్లిష్టమైన సమస్యలపై పోరాడే ప్రయత్నంలో ఈ బాలికా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మహిళా సాధికారకత విభాగ కో ఆర్డినేటర్ డాక్టరు పి.ఇందిరా, వై.సుష్మా, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీపీఎస్‌కు సామగ్రి అందజేత


సామగ్రి అందిస్తున్న బ్యాంక్ అధికారులు

అల్లూరు (కొత్తపట్నం): అల్లూరు గ్రామం కుమ్మరిపాలెం ఎంపీపీ స్కూల్‌కు ఐడీబీఐ బ్యాంక్, ఒంగోలు బ్రాంచ్ వారు రూ.1.50 లక్షల విలువైన విద్యా సామగ్రి, స్కూల్‌కు మౌలిక వసతులను శుక్రవారం బహూకరించారు. బ్రాంచ్‌వారు సిస్సార్ ఇన్ ఇంటియేటివ్ ప్రోగ్రాం ద్వారా రెండు కంప్యూటర్లు, టేబుళ్లు, కుషన్ చైర్లు, లేజర్ ప్రింటర్ అందజేశారు. అదేవిధంగా విద్యార్థులకు తాగునీటి వసతి కోసం ఆక్వా ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్ ట్యాంక్ అందించారు. పాఠశాలకు 15 చైర్లు, ఆఫీస్ టేబుల్ కూడా ఇచ్చారు. బ్యాంక్ ఏజీఎం చందన్, ఒంగోలు బ్రాంచ్ మేనేజర్ సురేష్, ఎంఈవో 1, 2 తులసీ, పద్మావతి, హైస్కూల్ హెచ్‌ఎం సుబ్బారావు, ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం మాలకొండయ్య, హనుమంతరావు, సాయిప్రసాద్, గ్రామస్తుడు పోలయ్య, చైర్మన్ చంద్రశేఖర్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.